# పాప మా బాలు డేమాయెనో?

గ్రంధి అప్పారావుగారు

ఆవేళ హాస్యనటకాగ్రేసర చార్లీచాప్లిన్ ఫిలుమగుటచే నేను తప్పనిసరిగా సాయంత్రము ఆరు ఘంటలకు సినీమాహాలునకు బయలుదేరితిని. కృష్ణపక్షము రోజులలో నే నిల్లుకదలకపోవుటకు కారణము దొంగలభయము. అప్పుడది శుక్లపక్షమే యగుటచే చంద్రుడు దేదీప్యమానముగా నంబరవీధిని ప్రకాశించుచుండుటచే నేను ధైర్యముగా నొంటరినై బయలుదేరితిని. సినీమాహాలువద్ద జనము మిక్కుటముగా నుండిరి కాన చాలప్రయాసతో కుర్చీటిక్కెట్టు కొనగలిగితిని. ఆట ప్రారంభమయినది మొదలు అంతమయ్యేవరకు ప్రేక్షకులు కడుపు చెక్కలగునటుల నవ్వుటకు చాప్లిన్ యొక్క వింతవింత చేష్టలనియే నిరాఘాటముగ చెప్పవచ్చును. నే నపరిమితానందభరితుడనైతిని. సినీమాయధికారులకు యిటువంటి ఫిల్ము తెప్పించినందులకు నాలో నేనే వారిని కొనియాడితిని. ఆట ఆఖరైనప్పటికి పదిఘంటలయినది. నేను గృహోన్ముఖుండనైతిని.

అప్పటివరకు పుచ్చపువ్వువలెయున్న వెన్నెల మటుమాయమైనది. కారుమబ్బులు గగనవీధిని ఆవరించియుండెను. ఉరుములు మెరుపులు మానవకోటిని భయపెట్టుచుండెను. అప్పుడు నామనసు యీతరాని వాడు సముద్రమధ్యమునపడిన యెట్లుండునో యట్లుండెను. ఒడలు కొంచెము వడకజొచ్చెను. గుండె ధైర్యము చేసుకొని, దైవమును తలంచుకొనుచు బయలుదేరితినే కాని సగముదూరము పోయినతరువాత కొందరు మనుష్యులు నన్నావరించుచున్నటుల నాకు కనబడెను. కేవలము భయముచేత నే ఆకారములటుల కాన్పించుచున్నవని గుండె మరింత ధైర్యము చేసుకొని చరచరనడచుటకు ఉద్యుక్తుడనైతినిగాని యంతలోనే యేదో ఒకచేయి నాజేబులోని కెక్కుచున్నటుల నాకుతోచెను. ఈసారి నాభయమునకు మేరలేకుండెను. దొంగవాడెవడో నాజేబులో చెయిపెట్టుచున్నాడని తెలిసికొని సగము ప్రాణముతోనున్న నేను ప్రాణమునకు తెగించి ఆదొంగవానిచేతిని నా రెండుచేతులలో నాయావద్బలము నుపయోగించి పట్టుకొంటిని. నేను పట్టుచేయి యెనిమిదేండ్లబాలునిదని నాకు అప్పుడు మెరసిన మెరపుకాంతివలన దెలిసెను. దొంగవాడు బాలుడని నేను తెలిసికొనినప్పుడు నాకు చాలధైర్యము వచ్చినది. వానిని పోలీసుస్టేషనులో నప్పగించుటకు బయలుదేరితిని. వర్షము కురియు నారంభించెను. అంత మేమొక యరుగుమీదకు వచ్చితిమి.

దొంగపిల్లవాడమాయికముగ యేడ్వజొచ్చెను. ఆయేడ్పుధ్వని వినినతోడనే నామనస్సులో నొకవిధమయిన కనికరము పొడచూపుటచే వానిని యేడ్చుటకు కారణమడుగగా నాతడు వెక్కుచు "అయ్యా! దీనపరాధిని. నన్ను మీరిప్పుడు ఖైదులో పెట్టుటకు తీసుకొని వెళ్ళుచున్నారా? నేనాపని చేయుటకు కారణమును చెప్పెదవినుడు." అనుచు కొంచెము సేపాగి 'తల్లీ! దైవము మనకు దూరమైనా' డని క్రిందపడిపోయెను. అప్పటికి వాన తగ్గిపోయెను. నేను సినిమాహాలువద్దకు పరుగునవెళ్ళి సోడాబుడ్డి నొకటి తీసుకొనివచ్చి ఆబాలునికి పట్టగా వాడు కొంతసేపటికి తెలివి దెచ్చుకొని 'అయ్యా! నాకొక తల్లియున్నది. తండ్రిసంగతి నాకు తెలియదు. నా తల్లి యీవూరిలో బిచ్చమెత్తి నన్ను పెంచుచున్నది. కాని నాలుగురోజులనుండి యామెకు జబ్బుగానున్నది. ఆమెకు యీరోజున తెలివి దప్పిపోయినది. నాతల్లి నెటులయిన కాపాడుటకు యీరోజున బిచ్చమునకు పోగా నొకతండ్రియైనను గుప్పెడు బియ్యము వేయలేదు. నాకును నాతల్లికిని నాలుగురోజులనుండి తిండిలేదు. ఆమె యిప్పుడు చావ సిద్ధముగ నున్నది.

కావున సినీమాకువచ్చెడి ధనవంతులజేబులలో డబ్బు దొంగతనము చేయుటకొరకు...” అని చెప్పుచు నా బాలుడు బేలగ నేడ్వజొచ్చెను. వానిని కొంచె మోదార్చితిని. వాడు చెప్పినదంతయు నిజమో లేక నా చేతులలోనుండి బయటపడుటకు వాడట్లుచెప్పెనో తెలిసికొనుటకు నన్ను వానియింటికి తీసుకొని పొమ్మంటిని. వాడు సరేయని బయలుదేరెను.

వాడు నన్నొక తాటాకుయింటివద్దకు తీసుకొని వచ్చి నిలువబడెను. నేను లోనికి ప్రవేశించి చూడగ నాయింటిలో నొక కునుకుదీపమును, పాత నులక మంచముమీద నొకస్త్రీ ‘మంచినీళ్ళు’ అని హీన స్వరముతో పలుకుచుండుటను గాంచితిని. బాలుడు భోరున యేడ్వసాగెను. పాప మా స్త్రీ బాలుని దగ్గరకు రమ్మని సైగచేసి వానిమోము తనమోముపై జేర్చుకొని కన్నీరు వలవల కార్చజొచ్చెను. కొంత సేపయిన తరువాత నామె కండ్లు మూసివైచెను.

బాలుడుచెప్పిన మాటలన్నియు నిజమని నిర్ధారణయయ్యెను. నేను పరుగుపరుగున నాస్నేహితుడగు డాక్టరు యింటిదగ్గరకువెళ్ళి వానితో జరిగినసంగతి క్లుప్తముగాచెప్పి వానిని పిల్లవాని కుటీరముదగ్గరకు తీసికొనివచ్చితిని. డాక్టరు ఆస్త్రీచేయి పట్టిచూచి ఆమె యంతకుముందే చనిపోయెనని తెలిసికొని చెప్పెను. అంత నాపిల్లవాడు వా రిద్దరివైపు చూచుచు యేడ్చెను. నేను వానికి ‘మరణము’ అందరికి వచ్చుట సహజమనిన్ని, యెప్పటికైనను ప్రతి వ్యక్తి కూడ చనిపోవలసిన వాడనిన్ని కొన్ని వేదాంతవాక్యములజెప్పి వానిశోక ముపశమనము జేసితిని. వాని తల్లియొక్క అంత్యక్రియలు స్వయముగా నేనే జరిపించి పిల్లవానిని నేనే తిండిపెట్టి పెంచెదనని చెప్పి వానిని నాయింటికి తీసికొనిపోయితిని. వాడు రెండురోజులు మాత్రమే నాయింట భోజనముచేసి యుండెను. మూడవరోజున వాడు నాకు కనపడ లేదు. ఊరంతయు వెదకితిని. జాడలేదు. పాప మా బాలు డేమాయెనో?—

# భావగీతమ, నీజన్మ పాడుకాను!!

కోడి. నారాయణస్వామిగారు బి. ఏ.

సీ॥ వివిధ ధర్మాధర్మ విజ్ఞానచంద్రికా ప్రభలగ్రాలు, ‘భారత’ ప్రముదనుతులు;
హరికథామృతసేవ నమరత్వమొందిన ‘భాగవతా’ బ్జాక్షిభాషణములు;
శృంగారరససింధు భృంగార్భటప్రతీతి బాను ‘నైషధ’ నారి భవ్యగీతి;
బహుభావ సౌరభభరిత ప్రసూనమా ‘వసుచరిత్రాం’గనా వాక్యసరణి;

తే॥గీ॥ వినగుతూహలమొందు మాదీనులందు,
భావ మదియేమొ గలదను భ్రాంతితోడ,
వెఱ్ఱికూతలనిడి విఱ్ఱవీగదేల?
భావగీతమ!, నీజన్మ పాడుకాను!!